నేడు అనంతలో రాష్ట్రస్థాయి వాల్మీకి జయంతి



ఏర్పాట్లపై ఆరా తీస్తున్న బీసీ సంక్షేమ రాష్ట్ర సంచాలకులు మల్లికార్జున, కలెక్టరు వినోద్‌కుమార్ తదితరులు

అశోక్‌నగర్ (అనంత సంక్షేమం), న్యూస్‌టుడే: అనంతపురంలో మహర్షి వాల్మీకి జయంతిని పండుగలా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాల్మీకి జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేయడంతో అనంతపురంలోనే బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వేడుకకు సన్నద్ధం చేశారు. గురువారం ఉదయం 10 గంటలకు అనంతపురం పవర్ ఆఫీసు వద్ద ఉన్న వాల్మీకి విగ్రహానికి పూలమాల వేస్తారు. అనంతరం నగరం శివారు గుత్తి రోడ్డులోని మార్కెట్ యార్డు పక్కన ఉన్న బల్లా కన్వెన్షన్ హాల్లో ఉదయం 11 గంటలకు సభా కార్యక్రమం నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగలా గురువారం నిర్వహించుకోవాలని ప్రకటించిందని బీసీ సంక్షేమ రాష్ట్ర సంచాలకులు, మేనేజింగ్ డైరెక్టరు మల్లికార్జున, కలెక్టరు వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సదస్సు నిర్వహించే సభాస్థలిని బుధవారం వారు పరిశీలించారు. ఏర్పాట్లపై పలు సూచనలు, సలహాలిచ్చారు.

ఇన్‌స్పైర్‌కు 122 ప్రాజెక్టులతో సమాయత్తం

కదిరి, న్యూస్‌టుడే: ఇన్‌స్పైర్ పోటీల్లో పాల్గొనేందుకు 122 ప్రాజెక్టులతో సమాయత్తం అవుతున్నట్లు జిల్లా సైన్సు అధికారి తనూజ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేనెలలో ప్రదర్శన పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఇందుకు ఇప్పటి నుంచి విద్యార్థులను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2024-25 విద్యా సంవత్సరానికి ఇన్‌స్పైర్ మనాక్ పథకంలో 216 పాఠశాలల నుంచి 797 ప్రాజెక్టులను నమోదైనట్లు డీఈఓ మీనాక్షి చెప్పినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల్లో పరిశోధనల పట్ల స్ఫూర్తి రగిల్చేలా ప్రాజెక్టుల రూపకల్పనకు సహకరించిన ఉపాధ్యాయులను అభినందించినట్లు వివరించారు.

ముంచేసిన ముసురు!

- వాయుగుండంతో జడివాన
- ఉమ్మడి జిల్లాలో వేరుసెనగ, టమాటా, మిరప రైతులకు నష్టం

ఈనాడు అనంతపురం, పుట్టపర్తి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారడంతో మంగళవారం రాత్రి నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లాలో వర్షం పడుతోంది. మరోవైపు ముసురు పట్టి.. వాతావరణం చల్లబడింది. దీంతో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వేరుసెనగతో పాటు మిరప, టమాటా, దానిమ్మ తదితర పంటలకు నష్టం వాటిల్లింది. అనంతపురం జిల్లాతో పోలిస్తే శ్రీసత్యసాయి జిల్లాలో నష్టం ఎక్కువగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. బుధవారం సాయంత్రానికి అనంతపురం జిల్లాలో సగటున 18.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. శ్రీసత్యసాయి జిల్లాలో 26.4 మి.మీ.కురిసింది. అత్యధికంగా ముదిగుబ్బ మండలంలో 54 మి.మీ.వర్షపాతం నమోదైంది. కర్ణాటకలో కురుస్తున్న వర్షాల కారణంగా జయమంగళి నదిలో వరద ప్రభావం కనిపించింది.

కుళ్లుతున్న వేరుసెనగ

జూన్‌లో ముందుగా విత్తుకున్న వేరుసెనగ ప్రస్తుతం కోత దశలో ఉంది. ఉమ్మడి అనంత జిల్లాలో చాలామంది రైతులు పంటను తొలగించి పొలాల్లోనే కుప్పలుగా వేశారు. వర్షంతో పంట నల్లగా మారి పొలాల్లోనే కుళ్లిపోతోందని రైతులు వాపోతున్నారు.

అనంతపురం జిల్లాలో 2.90 లక్షల ఎకరాలు, శ్రీసత్యసాయి జిల్లాలో 93 వేల ఎకరాల్లో వేరుసెనగ సాగు చేశారు. ప్రస్తుతం 30 శాతం కోత దశలో ఉంది. గురువారం వర్షాలు కొనసాగుతాయని వాతావరణశాఖ ప్రకటించిన నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో రెండు జిల్లాల వ్యవసాయశాఖ అధికారులు నష్టాన్ని అంచనా వేసే పనిలో నిమగ్నమయ్యారు.

తెగుళ్ల భయం

బహిరంగ మార్కెట్లలో టమాటా ధరలు ఆశాజనకంగా ఉన్నా వర్షం కారణంగా దిగుబడిపై ప్రభావం పడింది. వానకు టమాటా పూత రాలుతోంది. పలు మండలాల్లో కాయలు సైతం నేలరాలడంతో అన్నదాతలకు తీరని నష్టం వాటిల్లింది. వాతావరణం చల్లబడటంతో కాయల్లో మచ్చలు ఏర్పడుతున్నాయి. ఫలితంగా రైతులకు మార్కెట్ ధరలో సగం కూడా వచ్చే అవకాశం లేకుండా పోతోంది. ఉరవకొండ, గుంతకల్లు, రాయదుర్గం ప్రాంతాల్లో మిరప పంటకు నష్టం వాటిల్లింది. అధిక తేమ కారణంగా మొక్క ఎదుగుదల ఆగిపోవడంతో పాటు పూత రాలుతుండటంతో దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పశుగ్రాసమైనా దక్కేలా లేదు



నాకున్న 5 ఎకరాలతో పాటు 3 ఎకరాలు కౌలుకు తీసుకుని వేరుసెనగ సాగు చేశా. 5 ఎకరాల్లో పంట తొలగించి పొలంలోనే ఉంచాను. కౌలుకు తీసుకున్న మూడెకరాల్లో పంట కోత పూర్తిచేసుకుని వచ్చే సరికి వర్షాలు మొదలయ్యాయి. మిగిలిన 5 ఎకరాల్లో పంట నల్లగా మారిపోయింది. పశుగ్రాసానికి అసలు పనికిరాదు. ఇంకోరోజు వర్షం కురిస్తే కాయలు బూజుపట్టి మొలకెత్తుతాయి.

- మల్‌రెడ్డి, కనగానపల్లి



తోటలో రాలిపోయిన టమాటాలు

నేల రాలుతున్నాయి..



రూ.20 లక్షలు పెట్టుబడి పెట్టి 10 ఎకరాల్లో టమాటా సాగు చేశాను. ఇప్పటికీ ఐదు కోతలు పూర్తయ్యాయి. వర్షాల కారణంగా కాయలు దెబ్బతింటున్నాయి. కాయలు నేలరాలడంతో పాటు మచ్చలు ఏర్పడుతున్నాయి. ఫలితంగా దిగుబడి పూర్తిగా తగ్గిపోతుంది.

- సుభాస్కర్, ముదిగుబ్బ

32 మండలాల్లో వర్షపాతం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: జిల్లాలో మండలాల వారీగా వర్షపాతం వివరాలు పరిశీలిస్తే.. ముదిగుబ్బ 54.2 మి.మీ., బుక్కపట్నం 45.0, ధర్మవరం 44.4, పెనుకొండ 42.2, పుట్టపర్తి 39.8, కొత్తచెరువు 37.8, సీకే పల్లి 37.0, రొద్దం 34.8, సోమందేపల్లి 33.0, నల్లమాడ 25.8, గాండ్లపెంట 27.4, ఓడీసీ 36.8, అమడగూరు 25.6, గోరంట్ల 23.4, తాడిమర్రి 23.0, మడకశిర 21.4, తలుపుల 20.6, కదిరి 20.4, కనగానపల్లి 20.2, బత్తలపల్లి 20.2, రొళ్ల 19.6, హిందూపురం 19, ఎన్పీ కుంట 19.0, తనకల్లు 19.0, అగళి 18.8, నల్లచెరువు 16.0, లేపాక్షి 15.8, గుడిబండ 13.4, చిలమత్తూరు 11.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు జిల్లా ప్రణాళికాధికారి విజయకుమార్ తెలిపారు.

సమాచారం అందించండి

శ్రీసత్యసాయి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు వచ్చే సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు చేరవేయాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. బుధవారం ఆయన కంట్రోల్ రూమ్ తీరును పరిశీలించారు. సబ్‌డివిజన్ల వారీగా పరిస్థితులను సమీక్షించారు.



ముదిగుబ్బ: పొలంలో తడిసిపోవడంతో నల్లగా మారిన వేరుసెనగ

నిండుగా జయమంగళి నది

పరిగి, న్యూస్‌టుడే: కర్ణాటక ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు జయమంగళి నది నిండుగా ప్రవహిస్తోంది. రెండేళ్ల తరువాత నది నుంచి పరిగి చెరువుకు వరద వచ్చి చేరుతుండటంతో జలకళను సంతరించుకొంది. శ్రీసత్యసాయి జిల్లాలో బుక్కపట్నం, ధర్మవరం చెరువుల తరువాత పరిగి చెరువు పెద్దది. దీని కింద 2,821 ఎకరాల సాగు భూమి ఉంది. రైతులు ఎక్కువగా మొక్కజొన్న, మిరప, మల్బరీ పంటలు సాగు చేస్తారు. చెరువు పూర్తిస్థాయిలో నిండితే రెండు పంటలు పండుతాయి. వరి పంట సాగుకు రైతులు ఉత్సాహం చూపుతున్నారు. చెరువు నుంచి పంట పొలాలకు సాగునీటిని అందించే కాలువలు పూడికతో నిండి ఉన్నాయి. చివరి ఆయకట్టుకు సాగునీరు అందదని రైతులు తెలిపారు. ఇరిగేషన్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి కాలువల్లో పేరుకున్న పూడికను, ముళ్లకంపలు తొలగించేందుకు తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



శ్రీరంగరాజుపల్లి వద్ద కాజ్‌వేపై ప్రవాహం



మద్దిలేరువాగు వద్ద అధికారులతో చర్చిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టండి

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: వర్షాల వల్ల ముంపునకు గురయ్యే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంయుక్త కలెక్టర్ అభిషేక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కదిరి ఆర్డీఓ కార్యాలయంలోని కంట్రోల్‌రూంను సందర్శించారు. అనంతరం 2021లో భారీవర్షాల వల్ల దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించారు. ముఖ్యంగా పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపునీరు చేరకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పరిస్థితికి అనుగుణంగా ముంపు ప్రాంతాల వాసులను సురక్షితప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. పట్టణంలోని మద్దిలేరు వాగు పరివాహక ప్రాంతాన్ని పరిశీలించారు. సంయుక్త కలెక్టర్ వెంట కదిరి తహసీల్దార్ మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, నీటి పారుదలశాఖ ఏఈ మహేశ్ ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

పుట్టపర్తి, న్యూస్‌టుడే: వర్షాలకు జిల్లాలోని ప్రజలు ప్రమాదాలబారిన పడకుండా పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రత్న ఆదేశించారు. ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తున్న కారణంగా పాతబడిన నివాసాల్లో ఉండేవారు, లోతట్టు ప్రాంతాలు, చెరువులు, వంకలు, వాగుల పరిసరాల ప్రజలను అన్నిశాఖల అధికారులు సమన్వయంతో అప్రమత్తం చేయడానికి తగుచర్యలు తీసుకోవాలన్నారు. భారీ వర్షంతో వంతెనలు, కాలువలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. పోలీసు అధికారులు ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

ధర్మవరంలో మద్యం దుకాణంపై దాడి

- ఐదుగురి అరెస్టు



ధ్వంసమైన మద్యం సీసాలు



దాడిలో పగిలిపోయిన కంప్యూటర్, పరికరాలు

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురం సర్కిల్ వద్ద ప్రభుత్వ ఆధీనంలో ఉన్న మద్యం దుకాణంపై మంగళవారం అర్ధరాత్రి దాడి జరిగింది. ద్విచక్ర వాహనాల్లో వచ్చిన ఐదుగురు వ్యక్తులు వాచ్‌మెన్ వరదరాజులు వద్ద నుంచి దుకాణం తాళాలు లాక్కొని మద్యం సీసాలను పగులగొట్టారు. కంప్యూటర్ ధ్వంసం చేశారు. మద్యం టెండర్లలో నిర్వహించిన లాటరీలో 7వ నంబరు దుకాణం ధర్మవరానికి చెందిన వైకాపా నాయకుడు బాలిరెడ్డికి దక్కింది. బుధవారం దుకాణం ప్రారంభించేందుకు మంగళవారం రాత్రే అనంతపురం డిపో నుంచి మందు సీసాలు తీసుకువచ్చి దుకాణంలో ఉంచారు. దుండగుల దాడిలో బీరుతోపాటు, వివిధ రకాల బ్రాండ్ల మద్యం సీసాలు పగిలిపోయాయి. సంఘటనా స్థలాన్ని ధర్మవరం ఎక్సైజ్ సీఐ చంద్రమణి, ఎస్‌ఐ నాగరాజు పరిశీలించారు. వాచ్‌మెన్ నుంచి వివరాలు సేకరించారు. మద్యం దుకాణం ఇవ్వాలని కూటమి కొందరు నాయకులు గుడ్‌విల్‌కు అడిగారని, దుకాణం ప్రారంభించిన తర్వాత ఆలోచన చేద్దామని చెప్పినట్లు బాలిరెడ్డి పేర్కొన్నారు. రూ.10 లక్షల విలువైన సరకు తీసుకువచ్చి దుకాణంలో నిల్వ చేశానన్నారు. దాడిలో విలువైన మద్యం సీసాలు పగులగొట్టారని తెలిపారు. ఈ సరకును ఉదయం బాలిరెడ్డికి అధికారికంగా అప్పగించాల్సి ఉంది. సరకు ఎక్సైజ్‌శాఖ ఆధీనంలోనే ఉన్న సమయంలో దాడి జరగడంతో ధర్మవరం ఎక్సైజ్ ఎస్‌ఐ ధర్మవరం 1వ పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూ.1.35 లక్షల విలువైన మద్యం సీసాలు, రూ.20 వేలు విలువైన కంప్యూటర్ ధ్వంసం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గొట్లూరుకు చెందిన రహీమ్, మాబు, తిరుపాల్, ధర్మవరం రామ్‌నగర్‌కు చెందిన చంద్రశేఖర్, మంజునాథ్‌పై వివిధ సెక్షన్ల కింద 1వ పట్టణ ఎస్‌ఐ మహమ్మద్ రఫీ కేసు నమోదు చేశారు. దాడిలో పాల్గొన్న ఐదుగురిని అరెస్టు చేశారు.

అధ్వానం



అనంతపురం పాతూరు కూరగాయల మార్కెట్ తీరు ఇది. నిత్యం అపరిశుభ్రంగా ఉంటుంది. వానొస్తే అడుగు వేయలేని దుస్థితి. ఆ ప్రాంతం అంతా ఇరుకుగా ఉంటుంది. ఇక్కడ మండీ వ్యాపారులు రైతుల నుంచి వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తారు. కమీషన్, తరుగు పేరుతో రైతును నిలువునా మోసం చేస్తున్నారు. ఇక్కడ వ్యాపారులే ఒకో చోట ఒకో ధరతో వినియోగదారులకు విక్రయిస్తుంటారు.



ఏదీ వినియోగం

అనంత నగరంలోని లలిత కళాపరిషత్తు వద్ద గత తెదేపా ప్రభుత్వ హయాంలో రైతుబజారును ఏర్పాటు చేశారు. మొత్తం 32 స్టాల్స్, 20 దుకాణాలు.. డిజిటల్ ధరల బోర్డు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం ఉంది. ఎస్టేట్ అధికారితో పాటు 4 నుంచి 5 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. అన్ని వసతులు ఉన్నా పూర్తి స్థాయిలో వినియోగంలో లేదు. బయట వ్యక్తులు ఉదయం, సాయంత్రం వేళ్లలో కాలక్షేపం చేస్తుంటారు.

ఉన్నా ఉపయోగం లేదాయె

- వృథాగా రైతుబజార్లు
- కూరగాయల కొనుగోలుకు తప్పని తిప్పలు

అనంతపురం (వ్యవసాయం), హిందూపురం, న్యూస్‌టుడే: రైతులు పండించిన కూరగాయలు నేరుగా వినియోగదారులకు విక్రయించి ఆదాయం పొందడం.. వినియోగదారులకు తాజా, చౌకగా అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో గతంలో తెదేపా ప్రభుత్వం రైతుబజార్లను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా అనంతపురం, హిందూపురంలో రైతుబజార్లను నిర్మించింది. అప్పట్లో రైతులు, వినియోగదారులతో కళకళలాడేవి. ముఖ్యమంత్రులుగా పనిచేసిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి హయాంలో రైతుబజార్లు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయి. కనీసం రైతులు అటువైపు రాకుండా చేశారు. దళారులను ప్రోత్సహించే పరిస్థితికి తీసుకొచ్చారు. అన్నదాత చితికిపోయేలా చేశారు. ఈక్రమంలో కమీషన్లు, తరుగు పేరుతో పెద్దఎత్తున వ్యాపారులు మోసాలకు పాల్పడుతున్నారు. పచ్చి సరకు పేరిట 10 శాతం కమీషన్, 10 శాతం తరుగుతో దోపిడీకి పాల్పడుతున్నారు. తూకాల్లోనూ మోసం చేస్తున్నారు. ఇంత చేస్తున్నా మార్కెటింగ్, తూనికలు, కొలతలు శాఖ అధికారులు ఏమీ పట్టనట్టుగా ఉన్నారు.

నిర్మాణానికి ప్రతిపాదనలు: ఉమ్మడి అనంతపురం జిల్లాలో గత తెదేపా సర్కారు హయాంలో గుత్తి, గుంతకల్లు, తాడిపత్రి, ధర్మవరం పట్టణాల్లో రైతుబజార్లు నిర్మించాలని జిల్లా మార్కెటింగ్‌శాఖ ప్రతిపాదించింది. గుంతకల్లులో నిర్మాణాలు చేపట్టినా అసంపూర్తిగా ఉంది. ప్రతి మున్సిపాలిటీ పరిధిలో ఒకటి చొప్పున రైతుబజారు నిర్మించాలని మళ్లీ మార్కెటింగ్‌శాఖ ప్రతిపాదనలు పంపినా కార్యరూపం దాల్చలేదు. వైకాపా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. ఈక్రమంలో తెదేపా కూటమి సర్కారు అధికారంలోకి వచ్చింది. ప్రతి మున్సిపాలిటీలో రైతుబజారు అందుబాటులోకి తెచ్చి.. వాటిని సక్రమంగా నిర్వహిస్తే రైతులు, వినియోగదారులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

స్థలాల కోసం అన్వేషిస్తున్నాం..

రైతుబజారుకు కనీసం 25 సెంట్ల స్థలం అవసరం. పట్టణాల్లో స్థలాలు దొరకడం లేదు. ఆయా మున్సిపాలిటీల్లో తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లకు విజ్ఞాపనలు అందజేశాం. గుంతకల్లులో రైతుబజారు పూర్తి చేయడానికి రూ.10 లక్షలు అవసరం. అనంతపురంలో మరోచోట రైతుబజారును నిర్మించాల్సి ఉంది.

- సత్యనారాయణచౌదరి, ఏడీఎం, అనంతపురం

పశువుల షెడ్డుగా మారి..



హిందూపురంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ మార్గంలో రూపుకోల్పోయిన రైతుబజారు ఇది. గత తెదేపా హయాంలో నిర్మించారు. ప్రస్తుతం వినియోగంలో లేకపోవడంతో స్థానికులకు పశువుల షెడ్డుగా మారిపోవడం గమనార్హం.

రహదారే.. మార్కెట్



హిందూపురంలోని పెనుకొండ మార్గంలో రహదారిపైనే సాగుతున్న కూరగాయల విక్రయాలు. కొనుగోలు చేయాడానికి వినియోగదారులు నానా తంటాలు పడాల్సిన దుస్థితి నెలకొంది.



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ ఇన్‌ఛార్జి వీసీ సుదర్శనరావు

సాంకేతిక పరిజ్ఞానంతో పర్యావరణ పరిరక్షణ

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. జేఎన్‌టీయూ కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో బుధవారం గ్రీన్ ఎన్విరాన్‌మెంట్ కోసం మెంబ్రేషన్ ప్రాసెస్‌లు, ప్రస్తుత పరిస్థితి, సవాళ్లు అంశంపై అంతర్జాతీయ సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య సుదర్శనరావు హాజరయ్యారు. ప్రారంభోపన్యాసం చేస్తూ పర్యావరణ స్థిరత్వం ముఖ్యమన్నారు. మార్పులు రాకుండా ఉండాలంటే మెంబరిన్ టెక్నాలజీ ఉపయోగించాలన్నారు. ఐఎంఎస్ అధ్యక్షుడు మూర్తి మాట్లాడుతూ.. ఇండియన్ మెంబరిన్ సొసైటీ 1987లో స్థాపించారన్నారు. ఈ సొసైటీ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తోందన్నారు. సీఎస్ఐఆర్ శాస్త్రవేత్త శ్రీధర్ మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్ నియంత్రించడం కోసం కార్బన్ డై ఆక్సైడ్ తగ్గించాలన్నారు.

విద్యార్థులకు అపార్

డిజిటల్ కార్డుల జారీకి కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు

రాయదుర్గం పట్టణం, అనంతపురం విద్య, కొత్తచెరువు, న్యూస్‌టుడే: ఆధార్ తరహాలో విద్యార్థులకు అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కార్డులు జారీ చేయనున్నారు. నూతన విద్యా విధానంలో భాగంగా ప్రతి విద్యార్థికి అపార్ అందించనున్నారు. వన్ నేషన్ - వన్ స్టూడెంట్ నినాదంలో భాగంగా కేంద్ర విద్యాశాఖ అపార్ కార్డుల జారీకి శ్రీకారం చుట్టింది. కేజీ నుంచి పీజీ వరకు చదివే ప్రతి విద్యార్థికి గుర్తింపు సంఖ్యను కేటాయించనుంది.

ఒక్క స్కానింగ్‌తో అన్ని వివరాలు

అపార్ కార్డులో విద్యార్థి పేరు, పుట్టిన తేది, లింగం, ఫొటో, క్యూఆర్ కోడ్, 12 అంకెల గుర్తింపు సంఖ్య, మార్కులు, గ్రేడ్లు, ఉపకార వేతనాల వివరాలు, క్రీడలు, ఇతర అంశాల్లో సాధించిన విజయాలతో పాటు వ్యక్తిగత, విద్యా సంబంధింత వివరాలన్నీ ఉంటాయి. స్కాన్ చేయగానే మొత్తం వివరాలను తెలుసుకునేలా దీన్ని రూపొందించారు. ముందుగా 9-12 తరగతుల వారికి ఇవ్వడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో 9, 10 తరగతులు చదువుకుంటున్న విద్యార్థులకు ఈ కార్డులు జారీ చేసేందుకు మార్గదర్శకాలు విడుదల చేశారు.

తప్పనున్న అవస్థలు

ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు అనంతపురం జిల్లాలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ, కేంద్రీయ విశ్వవిద్యాలయంతో పాటు డిగ్రీ, పీజీ చదువుతున్నారు. రాష్ట్ర నిబంధనల ప్రకారం ఇక్కడి విద్యార్థులకు మాత్రమే ఉపకార వేతనాలు అందిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి చదువుకుంటున్న విద్యార్థులు ఇప్పటి వరకు ఇబ్బంది పడేవారు. వారంతా సొంత రాష్ట్రాల్లో ఉపకార వేతనాలకు దరఖాస్తు చేయాలనుకుంటే చదువుతున్న ప్రాంతంలో ధ్రువపత్రాలు తీసుకురావాలి. దాంతో చాలా మంది విద్యార్థులు అక్కడి నుంచి ఇక్కడికి, ఇక్కడి నుంచి అక్కడికి తిరగాల్సి వచ్చేది. అపార్ కార్డుల జారీతో కష్టాలు తప్పనున్నాయి. ప్రస్తుతం పాఠశాల విద్యార్థులకు యూడైస్ వెబ్‌సైట్‌లో పెన్ (పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబరు) ఉంది. దీని ఆధారంగానే విద్యార్థుల ప్రవేశాలు, టీసీలు జారీ చేస్తున్నారు. ఇదే తరహాలోనే ఇకపై అపార్‌తో అన్ని కార్యకలాపాలు నిర్వహిస్తారని అధికారులు చెబుతున్నారు.

ఉమ్మడి అనంత జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, విద్యార్థుల వివరాలు

ప్రాథమిక పాఠశాలలు	3,243
ప్రాథమికోన్నత..	502
ఉన్నత పాఠశాలలు:	1,539
1-8వ తరగతి వరకు విద్యార్థులు :	3,57,363
9, 10వ తరగతి చదువుతున్న వారి సంఖ్య:	87,897
ఇంటర్మీడియట్ విద్యార్థుల సంఖ్య :	20,555



అపార్ కార్డు నమూనా

ఎక్కడి నుంచైనా ప్రవేశాలు

'అపార్'తో ఎక్కడి నుంచైనా ప్రవేశాలు పొందవచ్చు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసే గుర్తింపు సంఖ్య ఆధారంగా అపార్ కార్డులో విద్యార్థి బ్యాంకు ఖాతా నంబరు, డీజీ లాకర్‌తో అనుసంధానమై ఉంటుంది. ఈ కార్డులను జారీ చేసే ముందు కేంద్ర ప్రభుత్వ అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఏబీసీ)ని ప్రారంభించింది. డీజీ లాకర్ ద్వారా వివరాలు నమోదు చేస్తే విద్యార్థి పేరుతో సహా అపార్ కార్డు వస్తుంది. దీన్ని నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీని ద్వారా వివిధ విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ప్రవేశ పరీక్షల్లో వివరాల నమోదు, ధ్రువీకరణ తదితర పనులన్నీ సులువుగా పూర్తవుతాయి. ఇకపై ఉపకార వేతనాల మంజూరు, ఉద్యోగాల భర్తీ, ఇతర సందర్భాల్లో ఇదే కీలకం కానుంది. ఈ విధానంపై ఇప్పటికే అధికారులకు అవగాహన కల్పించారు.

'పరస్పర సహకారంతో అభివృద్ధి'



క్యాంపు కార్యాలయంలో పరిటాల సునీతతో మాట్లాడుతున్న దగ్గుపాటిప్రసాద్

రాంనగర్ (అనంతపురం) న్యూస్‌టుడే: రాప్తాడు, అనంతపురం అర్బన్ నియోజకవర్గాల పరిధిలోని కాలనీలు, గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం పరస్పర సహకారంతో కలిసి అభివృద్ధి అడుగులు వేస్తామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ పునరుద్ఘాటించారు. బుధవారం అనంతపురం నగరం అరవిందనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఇరువురు ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. అనంతపురం గ్రామీణం కాలనీలు, రాప్తాడు మండలం బండమీదపల్లి పంచాయతీ అభివృద్ధి పనులపై గంటపాటు చర్చించారు. ప్రధానంగా ఇరువురు ఎమ్మెల్యేల పరిధిలో కాలనీలు, గ్రామాల్లో అనేక సమస్యలు ఉన్నాయని, అందులో నడిమివంక పరిసర ప్రాంతాలు ముంపునకు గురికాకుండా వంకకు రక్షణ గోడలు నిర్మాణాలు చేపట్టాలని సునీత దగ్గుపాటిప్రసాద్‌కు సూచించారు. రాప్తాడు మండలం ఎం.బండమీదపల్లి సొంత గ్రామమని, అది రాప్తాడు నియోజకవర్గం పరిధిలోకి వస్తోందని, ఈ పంచాయతీలో పలు అభివృద్ధి పనులు చేపట్టాలని దగ్గుపాటి ప్రసాద్ కోరారు.

'పేదల కడుపు కొట్టిన వైకాపా ప్రభుత్వం'



అన్న క్యాంటీన్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జయరాం, తదితరులు

గుంతకల్లు, న్యూస్‌టుడే : వైకాపా ప్రభుత్వం ముందు వెనుకా ఆలోచించకుండా అన్న క్యాంటీన్‌లను మూసివేసి పేదల కడుపుకొట్టిందని గుంతకల్లు ఎమ్మెల్యే జయరాం దుయ్యబట్టారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఎక్కువ డబ్బులు చెల్లించి హోటళ్లకు వెళ్లి భోజనం చేసే పరిస్థితి పేదలకు లేదని, దీన్ని దృష్టిలో ఉంచుకుని తక్కువ ధరకు రుచికర భోజనాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. మున్సిపల్ అధికారులు క్యాంటీన్ నిర్వహణను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నయాం అహ్మద్, తెదేపా జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, పట్టణ అధ్యక్షుడు ఆనంద్, తెదేపా నాయకులు నారాయణ స్వామి, శ్రీనివాసులు, కమ్మిరెడ్డి పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే పుట్టినరోజు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షురాలు భవాని, తెదేపా వైద్యుల విభాగం జిల్లా అధ్యక్షురాలు హిమబిందు, నాయకుడు ప్రతాప్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలోచన అంకురం.. అతివలే సారథ్యం

● ఉద్యోగాల కల్పన దిశగా స్టార్టప్‌లు ● అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం శిక్షణతో ముందుకు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: చదువులు పూర్తవ్వగానే ఉద్యోగం కోసం అన్వేషించడం కాకుండా ఉద్యోగాలు కల్పించే దిశగా పలు రంగాల్లో మహిళల ఆలోచనా విధానం ఉంటోంది. అటల్ ఇంక్యుబేషన్ కేంద్రంలో అలా శిక్షణ పొందిన మహిళలు తమ సత్తా చాటుతున్నారు. 2018లో ఏర్పడిన ఎస్కేయూ అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం 900 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ఆలోచనల్ని సేకరించింది. అందులో 40 శాతం ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు ఉండటం విశేషం. వీరంతా ఎస్కేయూ- ఏఐసీలోని నిపుణుల శిక్షణ, సూచనలు, సలహాలు, సహకారంతో స్టార్టప్‌లు ఏర్పాటు చేసుకున్నారు. అలా మహిళలు ఏర్పాటు చేసిన కొన్ని స్టార్టప్‌లకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బహుమతులు దక్కాయి.

● అంకుర సంస్థలు ఒకప్పుడు నగరాలకే పరిమితమయ్యేవి. ఎస్కేయూ అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ గ్రామీణ ప్రాంతాలపై దృష్టి సారించింది. గ్రామీణ ప్రాంతాల ప్రజల సమస్యలు, రైతాంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించే దిశగా సాంకేతిక పరిజ్ఞానంతో ఇన్నోవేషన్, స్టార్టప్‌ల స్థాపనకు కృషి చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాచుర్యం పొందిన స్టార్టప్ ఇవే..



ఎస్కేయూలోని అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం

రేడియాలజీలో సాంకేతిక విధానం

● స్టార్టప్ : డీప్ ఇన్‌ఫినిటీ ఏఐ ● రూపకర్త పేరు: రమ



సిబ్బందితో చర్చిస్తున్న రమ

అంకుర సంస్థ పనితీరు : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్ ఇది. రోగులు తీయించుకున్న ఎక్స్‌రే, స్కానింగ్ పిక్చర్లను జోడించాలి. రేడియాలజిస్ట్ రాసే రాతలు, చెప్పే భాష చాలా మందికి అర్థం కాదు. ఈ సాఫ్ట్‌వేర్ ఆధారంగా ఆ వివరాలు సులువుగా అర్థమయ్యేలా నివేదిక అందిస్తుంది. ఎస్కేయూ సమీపంలో దీన్ని వినియోగిస్తున్నాం. చిన్నచిన్న పట్టణాల్లో వైద్యులు కూడా గుర్తించని వ్యాధుల వివరాలను సాఫ్ట్‌వేర్ గుర్తిస్తుంది. యూకే నుంచి వచ్చిన ఎక్స్‌రే, స్కానింగ్ నివేదికల రూపకల్పనకు తోడ్పాటు అందిస్తున్నాం. కొన్ని సంవత్సరాల్లో దీన్ని ఆసుపత్రుల్లో ఉపయోగించేలా కృషి చేస్తాం **- రమ**

గ్రామీణుల ఆరోగ్య సంరక్షణకు కృషి

● స్టార్టప్ : సోనిక్ ఏ టు బీ సొల్యూషన్
● రూపకర్తలు : అఖిల, ఆషాక్రాంతి, బేబీశ్రీ



అవార్డు అందుకున్న అఖిల, ఆషాక్రాంతి, బేబీశ్రీ

అంకుర సంస్థ పనితీరు : గ్రామీణ ప్రజలు రోగాల బారిన పడితే వారు వైద్య పరీక్షలకు పట్టణాలకు వెళ్లాల్సిందే. పట్టణాలలోని వైద్య ప్రయోగశాలల్లో రక్తపరీక్షలు చేయించుకొని డాక్టరును సంప్రదించడానికి ఒకరోజు పడుతుంది. రక్తపరీక్షల ఫలితాలు రావడానికి ఆలస్యమైతే రెండోరోజు కూడా వెళ్లాల్సిన పరిస్థితి. గ్రామీణులకు ఈ వ్యవహారం ఎంతో వ్యయప్రయాస. గ్రామీణులకు వైద్యం అందేలా మొబైల్ డయాగ్నస్టిక్ ఏర్పాటు చేసేలా వారి ఆలోచనలకు ఇంక్యుబేషన్ సెంటర్ సహకారం అందించింది. ప్రస్తుతం వారు వ్యాన్‌లో డయాగ్నస్టిక్ యంత్రాలు అమర్చారు. గ్రామీణ ప్రాంతాల్లో క్యాంప్ ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి రిపోర్ట్ కూడా అందజేస్తున్నారు. గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో రోగులకు అవసరమైన పరీక్షలు అందిస్తున్నారు. గ్రామీణులకు మొబైల్ డయాగ్నస్టిక్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తూ వీరు ఉపాధి పొందుతున్నారు. థాయ్‌లాండ్‌లో జరిగిన అంకుర సంస్థ పోటీలకు వారు ఎంపికయ్యారు. వారికి ఇన్నోవేషన్ క్రియేటివ్-2024లో అవార్డు దక్కింది.

● తమ స్టార్టప్‌కి అంతర్జాతీయస్థాయి గుర్తింపు దక్కింది. ఈ విజయానికి ఎస్కేయూ- ఏఐసీ ఎంతో సహకారం అందించింది. తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ డయాగ్నస్టిక్ ద్వారా ఏ టు బీ సొల్యూషన్ పేరుతో పరీక్షలు నిర్వహించి గ్రామీణ ప్రజల రక్షణకు కృషి చేస్తున్నాం. **- అఖిల, ఆషాక్రాంతి, బేబీశ్రీ**

పీజీ కోర్సుల్లో తక్షణ ప్రవేశాలు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో వివిధ పీజీ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లకు తక్షణ ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు సంచాలకులు ఆచార్య జి.నరసింహన్ తెలిపారు. ఈ నెల 19న నేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలియజేశారు. పీజీ సెట్-2024లో అర్హత సాధించిన అభ్యర్థులు అర్హులు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో అడ్మిషన్స్ విభాగానికి హాజరు కావాలన్నారు. ఫీజులు ఆరోజే పూర్తిగా చెల్లించాల్సి ఉంటుందన్నారు.

20న సివిల్స్ ఉచిత శిక్షణపై అవగాహన

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దిల్లీకి చెందిన సివిల్స్ కోచింగ్ సంస్థ డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ ద్వారా సంస్కృతి స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఈనెల 20న ఉచిత శిక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. దిల్లీలో సివిల్స్ శిక్షణ అందిస్తున్న లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ వారితో మంత్రి సత్యకుమార్ యాదవ్ చర్చించి ధర్మవరంలో ఉచిత సివిల్స్ శిక్షణ ఇప్పించేందుకు ఒప్పించారన్నారు. సత్యకుమార్ యాదవ్, లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ సంస్థ అధినేత డాక్టర్ లక్ష్మయ్య హాజరు అవుతున్నారన్నారు. ధర్మవరం నియోజకవర్గ పరిధిలో డిగ్రీ పూర్తి చేసుకున్న యువతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు మంత్రి కార్యాలయ సిబ్బంది మల్లికార్జున 79982 56789, నరేంద్ర 94904 42576 లకు సంప్రదించాలన్నారు.


వైభవ్ జ్యువెలరీ షోరూమ్ ప్రారంభం



షోరూమ్‌లో ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, ఏపీ ఐజీ అంజనాసిన్హా, నిర్వాహకులు

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే: అనంతపురం నగరం రాజు రోడ్డులో వైభవ్ జ్యువెలరీ షోరూమ్‌ను ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, ఏపీ ఐజీ అంజనా సిన్హా ప్రారంభించారు. మొదటగా జ్యోతి వెలిగించి షోరూమ్‌లో ఉన్న వివిధ రకాల నగలను పరిశీలించారు. వైభవ్ జ్యువెలరీ 16వ షోరూమ్‌ను నగరంలో ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఉత్తమ నాణ్యత, అనువైన ధరలతో విభిన్న రకాల డిజైన్లలో బంగారు ఆభరణాలు ఉన్నాయన్నారు. అనంత నగర ప్రజలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. భాజపా యువ మోర్చా అధ్యక్షుడు వంశీకృష్ణ, ఐటీసీ డీలర్ సుబ్బరాయుడు, వైభవ్ సంస్థల ఎండీ భారత మల్లిక రత్నకుమారి, డైరెక్టర్లు కీర్తన, రాఖాల్, సింధూరి వెంకటేశ్, అమరేంద్ర, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి యువరైతు బలి



అంజినప్ప

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ మండలం కోనాపురం గ్రామానికి చెందిన అంజినప్ప (27) అనే రైతు బుధవారం విద్యుదాఘాతంతో మృతిచెందారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. అంజినప్పకు 1.5 ఎకరాల భూమి ఉంది. వ్యవసాయం చేస్తూ, కూలీ పనుల ద్వారా భార్య సులోచన, మూడేళ్ల లోపు వయసు ఉన్న ఇద్దరు కుమార్తెలు దీక్షిత, హర్షితలను పోషిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం పొలంలో విద్యుత్తు మోటార్‌ను ఆఫ్ చేసేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. గుర్తించిన స్థానికులు, కుటుంబ సభ్యులు ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భర్త మృతితో భార్య తమకు దిక్కెవరంటూ పిల్లలను అనాథలు చేశావని కన్నీరుమున్నీరుగా విలపించారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కారు - లారీ ఢీ
క్షతగాత్రులను కాపాడిన స్థానికులు



నుజ్జయిన కారు నుంచి క్షతగాత్రులను బయటకు తీస్తున్న స్థానికులు

యాడికి, న్యూస్‌టుడే : యాడికి మండలంలోని 67వ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన నలుగురిని బాటసారులు, స్థానికులు తక్షణం స్పందించి కాపాడారు. తాడిపత్రికి చెందిన రాఘవ, శ్రీధర్, సుదర్శన్‌రెడ్డి, సూర్య కలిసి కారులో గుత్తికి బయలుదేరారు. మార్గమధ్యంలో వేములపాడు సమీపాన లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో గుత్తి వైపు నుంచి గ్రానైట్ లోడుతో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. వాహనం నడుపుతున్న శ్రీధర్ కారులో ఇరుక్కుపోయారు. ముందు సీట్‌లో ఉన్న ఇద్దరు ఆర్తనాదాలు చేశారు. ఆ మార్గంలో వెళ్తున్న వాహన చోదకులు, స్థానికులు స్పందించారు. కారులోంచి అతికష్టం మీద క్షతగాత్రులను పది నిమిషాల వ్యవధిలో బయటకుతీశారు. తీవ్రంగా గాయపడ్డ అతన్ని ప్రత్యేక వాహనంలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులైన రాఘవ, సుదర్శన్‌రెడ్డి, సూర్యను 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విభాగినిని ఢీకొని మహారాష్ట్ర వాసి మృతి

తాడిపత్రి: తాడిపత్రిలోని సీబీ రోడ్డుపై ఉన్న విభాగినిని (డివైడర్‌ను) ఢీకొని మహారాష్ట్ర వాసి మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. మహారాష్ట్రకు చెందిన అనిల్‌కుమార్ (29) ఉపాధి నిమిత్తం ఇటీవల తాడిపత్రికి వచ్చాడు. నందలపాడులో నివాసం ఉంటూ ఐస్‌క్రీం అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం రామచంద్రలాడ్జి సమీపాన ద్విచక్ర వాహనంపై వెళ్తున్న అతను మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి విభాగినిని ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

జూదరుల అరెస్టు.. నగదు స్వాధీనం

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని సుందరయ్యనగర్ శివార్లలో బండల చేను వద్ద బుధవారం 11 మంది జూదరులను రెండో పట్టణ సీఐ రెడ్డెప్ప అరెస్టు చేశారు. బండల చేను ప్రాంతంలో జూదం ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో రెడ్డెప్ప ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. 11 మందిని అరెస్టు చేసి రూ. 1,16,750 నగదు, 11 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

డ్రైవర్ నిద్రమత్తు.. బస్సు బోల్తా
తప్పిన ప్రమాదం.. 10 మందికి గాయాలు



బోల్తాపడిన ప్రైవేట్ బస్సు

రాప్తాడు, న్యూస్‌టుడే: రాప్తాడు మండలం హంపాపురం సమీపంలోని జాతీయ రహదారి-44పై ప్రైవేట్ బస్సు బోల్తాపడి 10 మందికి స్వల్ప గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి బెంగళూర్ వెళ్తున్న వీవీఎస్ఆర్ ట్రావెల్స్ బస్సు హంపాపురం సమీపాన ఇండియన్ పెట్రోల్ బంకు సమీపంలో తెల్లవారుజామున 4 గంటల సమయంలో డ్రైవర్ నిద్రమత్తులో డివైడర్ ఎక్కించడంతో బస్సు బోల్తా పడింది. బస్సులో 60 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు. బస్సు వెనుక భారీ వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. తెల్లవారుజామున రాప్తాడు సీఐ శ్రీహర్ష చేరుకొని గాయపడ్డ ప్రయాణికులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ లేకుండా చూశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హిందూపురం

•హిందూపురం •పెనుకొండ •మడకశిర



నేలమట్టమైన ఇంటి వద్ద నారాయణప్ప

జడివానకు కూలిన ఇల్లు

లేపాక్షి, న్యూస్‌టుడే: మండలంలోని కంచి సముద్రం పంచాయతీ మామిడిమాకులపల్లిలో నారాయణప్పకు చెందిన పాత ఇల్లు మూడు రోజులుగా కురుస్తున్న జడివానకు నేలమట్టం అయ్యింది. ఇంట్లో ఎవరూ లేనందున ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని, ప్రభుత్వం తనకు కొత్త ఇల్లు మంజూరు చేయాలని బాధిత రైతు కోరారు.

తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం

సోమందేపల్లి, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమందేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ఉప తహసీల్దార్ రెడ్డిశేఖర్ ఆధ్వర్యంలో సోమందేపల్లి, చాలకూరు, మండ్లి వీఆర్‌వోలు నాగరాజు, అయూబ్‌ఖాన్, రామాంజనేయులు, వెంకట్రామిరెడ్డి, పలువురు వీఆర్‌ఏలు 24 గంటల పాటు కార్యాలయంలో అందుబాటులో ఉన్నారు. అన్ని గ్రామ పంచాయతీల వీఆర్‌వోలు, కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, పోలీస్, విద్యుత్తు, గృహ నిర్మాణ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉంటూ మండలంలో ఎలాంటి ఘటనలు చోటుచేసుకున్నా, ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసికెళ్లి తగిన చర్యలు చేపట్టనున్నట్లు ఉప తహసీల్దార్, ఈఓపీఆర్డీ లక్ష్మీనరసమ్మ, ఆర్ఐ లక్ష్మీదేవి తెలిపారు.

వాల్మీకి జయంతి వేడుకలు నేడు

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం పట్టణంలో గురువారం వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. ఉదయం 11 గంటలకు పొట్టిశ్రీరాములు కూడలి నుంచి వాల్మీకి దేవాలయం వరకు మహిళలతో ఉత్సవ దీపారాధన, వాల్మీకి మహర్షి ఉత్సవ విగ్రహానికి దీపారాధన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మణేసముద్రంలో రెండు సీసీ రోడ్లకు రూ.50లక్షలు, కగ్గల్లులో రూ.40 లక్షలతో ఒక రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు ఎంపీడీఓ సరస్వతి తెలిపారు. పంచాయతీరాజ్ ఇంజినీర్ హనుమేనాయక్, ఉపాధిహామీ ఏపీవో లలితాకుమారి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామపెద్దలు భూమి పూజ చేసి రోడ్ల పనులను ప్రారంభించారు.

నిందితుడి ఆచూకీ కోసం గాలింపు

హిందూపురం, న్యూస్‌టుడే: అత్తా, కోడలిపై అత్యాచార ఘటనలో నిందితుడు చాకలి శ్రీనివాసులు ఆచూకీ కోసం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. ఇతని కోసం కర్ణాటక ప్రాంతంతోపాటు జిల్లాలో పలుచోట్ల నిఘా ఉంచి, పట్టుకొనేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఈ ఘటనకు పాల్పడిన ఆరుగురు నిందితుల్లో ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం విదితమే.

తాగునీరు వృథా..

అమరాపురం, న్యూస్‌టుడే: మండలంలోని గౌడనకుంట తాగునీటి పథకం బోరు నుంచి నీరు వృథాగా పోతున్నాయి. గత మూడు నెలలుగా నీరు వృథా అవుతున్నా మరమతులు చేయడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. దీనిపై తమ్మడేపల్లి సర్పంచి గిరిజమ్మను వివరణ కోరగా మరమ్మతు చేసి నీటి వృథాను అరికడతామని చెప్పారు.

ఎరువుల వాహనం బోల్తా

అగళి, న్యూస్‌టుడే: మండలంలోని హుల్లేకెర, విద్యుత్తు ఉప కేంద్రం మధ్యలో జాతీయ రహదారిపై మలుపులో ఎరువుల లోడుతో వెళ్తున్న వాహనం బోల్తా పడిందని ఏఎస్ఐ శ్రీరాములు తెలిపారు. అందులో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదన్నారు.

నడింపల్లి చెరువు పరిశీలన

సోమందేపల్లి, న్యూస్‌టుడే: నడింపల్లి గ్రామ చెరువుకు గండి పడటంతో బుధవారం జల వనరులశాఖ ఇన్‌ఛార్జి డీఈ లక్ష్మీనారాయణ, ఏఈ రమేశ్ పరిశీలించారు. స్థానిక తెదేపా నాయకులు రామాంజనేయులు, ఆంజనేయులు, రైతులతో కలిసి చెరువును పరిశీలించారు. చెరువుకు తూము వద్ద చిన్నపాటి గండి పడి వారం రోజులు కావస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. తీవ్ర అల్పపీడనం కారణంగా రెండు రోజులుగా జల్లులు కురుస్తున్న నేపథ్యంలో బుధవారం 'ఈనాడు'లో కథనం ప్రచురితం కావడంతో ఆయాశాఖల అధికారులు స్పందించారు. చెరువుకు గండి పడిన చోటును పరిశీలించారు. గురువారం ఇసుక బస్తాలు వేయించి, తాత్కాలిక మరమ్మతులు చేపట్టనున్నట్లు డీఈ, ఏఈలు తెలిపారు.

పంటలు వర్షార్పణం

రైతులకు తీవ్ర నష్టం

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వేరుసెనగ రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇప్పటికే తొలగించిన వేరుసెనగ పంటను వాములుగా వేసి భద్రపరిచారు. మరికొంతమంది తొలగించిన పంటను పొలాల్లో వదిలేయగా కుప్పల్లోనే మొలకెత్తుతున్నాయి. కాయలు రంగు మారాయి. వేరుసెనగ కట్టె నల్లగా మారి గ్రాసానికి కూడా పనికి రాకుండా పోయింది. సాగు కోసం పెట్టిన పెట్టుబడి చేతికందదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మడకశిర నియోజకవర్గంలోని మడకశిర, అమరాపురం, గుడిబండ, రొళ్ల, అగళి మండలాల్లో వేరుసెనగ సాధారణ సాగు 65వేల ఎకరాలు కాగా ఈఏడాది 39 వేల ఎకరాల్లో సాగు చేశారు. ప్రారంభం నుంచి పంట ఆశాజనకంగా ఉన్నా.. తొలగించే సమయంలో వర్షాలకు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై వ్యవసాయ శాఖ ఏడీఏ కృష్ణమీనన్ మాట్లాడుతూ వర్షానికి పంటలు కొట్టుకుపోయి నష్టం వాటిల్లితే అంచనా వేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. ప్రస్తుతం పంట తొలగించడం ఆలస్యమై చెట్లలోనే మొలకెత్తితే అటువంటి వాటికి పరిహారం అందదని చెప్పారు.

● చెట్లపైనే మొలకెత్తిన కాయలను చూపుతున్న ఈ రైతు మడకశిర మండలం శివాపురం గ్రామానికి చెందిన ఆంజినప్ప. రెండెకరాల్లో వేరుసెనగ సాగు చేశారు. పెట్టుబడి రూ.30వేలు పెట్టారు. పదిహేను రోజుల ముందే పంటను తొలగించాలని అనుకున్నారు. వర్షం కురుస్తుండటంతో వీలుకాలేదు. చెట్లలోనే మొలకెత్తుతుండటంతో రెండు రోజుల కిందట తొలగించారు. పంట పూర్తిగా దెబ్బతింది. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని రైతు కోరుతున్నారు.



మిర్చి రైతు విలవిల

గుడిబండ: మండలంలోని తిమ్మలాపురం, మోరుబాగల్, బీటీపల్లి, మద్దనకుంట, కేకే పాళ్యం తదితర గ్రామాల్లో రైతులు మిర్చి పంట కోత కోశారు. వాటిని వారం రోజులపాటు ఎండబెట్టాల్సి ఉంది. ఆ ప్రకారమే రైతులు తమకు సౌకర్యం ఉన్న చోట ఆరబెట్టారు. అయితే వర్షానికి మిర్చి తడిసిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మిర్చి కుళ్లిపోయే పరిస్థితి ఏర్పడింది. ఆదుకోవాలని రైతులు భీమరాజు, శ్రీనివాస్, హనుమంతరాయప్ప తదితరులు కోరారు.



తడిసిన మిర్చిని చూపుతున్న రైతు భీమరాజు

● నల్లగా మారిన వేరుసెనగ పంటను చూపుతున్న రైతు నాగరాజు. మడకశిర మండలం మెళవాయి స్వగ్రామం. వారం రోజుల కిందట పంట తొలగించారు. కుప్పగా వేసి భద్రపరచుకునేలోపు వర్షం రావడంతో పొలంలోనే వదిలేశారు. తీగ మొత్తం తడిసి నల్లగా మారింది. మూడెకరాల్లో పంట దెబ్బతింది. పెట్టుబడి రూ.40వేలు పెట్టారు. కాయలు రంగుమారాయి. వాటిని విడిపించి విక్రయిద్దామంటే ధర ఉండదు. గ్రాసానికి పనికి రాక, వేరుసెనగ కాయల దిగుబడి లేక తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకొంటున్నారు.



మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

హిందూపురం: 80085 73018, పెనుకొండ: 91000 20922, మడకశిర: 76759 19016

సమస్య: రొళ్ల గొల్లహట్టి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఎదుట వృథా నీరు నిల్వ చేరి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. **- శివన్న, స్థానికుడు**

సమాధానం: తగిన చర్యలు తీసుకుంటాం. **- శ్రీనాథ్, పంచాయతీ కార్యదర్శి**

సమస్య: రొళ్లలోని మారుతి కాలనీకి వెళ్లే దారిలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. **- నాగేశ్**

సమాధానం: కొత్తవి ఏర్పాటు చేయిస్తాం. **- రామలక్ష్మమ్మ, సర్పంచి, రొళ్ల**

– న్యూస్‌టుడే, రొళ్ల

సమస్య: గుడిబండ మండలం బీటీపల్లిలో రోడ్డు బురదమయంగా మారింది. **- రంగేగౌడు**

సమాధానం: బురద, మురుగు తొలగిస్తాం. **- నాగరాజునాయక్, ఈఓఆర్డీ**

సమస్య: కొంకల్లు ఇందిరమ్మ కాలనీలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. **- నాగరాజు**

సమాధానం: త్వరలో వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. **- కవిత, సర్పంచి, కొంకల్లు**



సమస్యలు పరిష్కారం: మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను 'ఈనాడు'లో మేమున్నాం.. మీకుతోడుగా శీర్షికన ప్రచురించగా బాధ్యులు స్పందించారు. చిగతుర్పి బీసీ కాలనీలో సర్పంచి శివరుద్రమ్మ వీధి దీపాలు ఏర్పాటు చేసి అంధకారం తొలగించారు. రాళ్లపల్లి ఎస్సీ కాలనీలో సర్పంచి లక్ష్మీనారాయణ తాగు నీటి సమస్య పరిష్కరించారు. ఎస్.రాయాపురం బీసీ కాలనీలో సర్పంచి రాధమ్మ వీధి దీపాలు ఏర్పాటుచేసి అంధకారం తొలగించారు. కురుబరపల్లి పాఠశాల సమీపంలోని ట్యాంకు వద్ద అపరిశుభ్రతను ఈఓఆర్డీ నాగరాజునాయక్ తొలగించారు.

– న్యూస్‌టుడే, గుడిబండ

నదీ పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయండి

పరిగి, న్యూస్‌టుడే: జయమంగళి నది పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని పెనుకొండ ఆర్డీవో ఆనంద్‌కుమార్ రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. కర్ణాటక ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు జయమంగళి నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. అక్కడి నుంచి నీరు పరిగి చెరువుకు చేరుతోంది. బుధవారం పెనుకొండ ఆర్డీఓ, డీఎస్పీ శ్రీనివాసులు, స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు శాఖ అధికారులు శ్రీరంగరాజుపల్లి, పరిగి గ్రామాల్లో పర్యటించారు. పాయకట్ట వద్ద గేట్ల నుంచి దిగువన పరిగి చెరువుకు వస్తున్న వరదను పరిశీలించారు. శ్రీరంగరాజుపల్లి గ్రామ సమీపంలో కాజ్‌వేపై నీటి ప్రవాహం కారణంగా రాకపోకలు స్తంభించాయి. ప్రజలు సాహసం చేసి కాజ్‌వేపై ప్రయాణించొద్దని ఆర్డీఓ సూచించారు. అడ్డుగా ముళ్లకంపలు వేయించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు వెంకట్రామిరెడ్డి, కొండూరు నవీన్ మాట్లాడుతూ తూగుటయ్యాల వద్ద పరిగి చెరువు కట్ట బలహీనంగా ఉందని, చెరువు నిండక ముందే లీకేజీలు అరికట్టాలని ఆర్డీఓను కోరారు. ఆయన స్పందిస్తూ ప్రతిపాదనలు తయారు చేసి పనులు సత్వరమే ప్రారంభించాలని ఇరిగేషన్ శాఖ డీఈఈ లక్ష్మీనారాయణను ఆదేశించారు. పాయకట్ట వద్ద రాత్రివేళ కొందరు ఆకతాయిలు గేట్ల పలకలను ధ్వంసం చేస్తుండటంతో వరద నీరు ఏటి పాలవుతోందని, తగు చర్యలు తీసుకోవాలని పెనుకొండ డీఎస్పీ శ్రీనివాసులు దృష్టికి రైతు సంఘం నాయకులు తెచ్చారు. గస్తీ ఏర్పాటు చేసి ఆకతాయిల ఆటకట్టించాలని డీఎస్పీ స్థానిక ఎస్సై రంగడుయాదవ్‌ను ఆదేశించారు. వారి వెంట తెదేపా మండల కన్వీనర్ ఎస్ఎన్.గోవిందరెడ్డి, ఆర్ఐ సిద్దేశ్వర్, ఈఓఆర్డీ శ్రీధర్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



పాయకట్ట వద్ద వరదను పరిశీలిస్తున్న పెనుకొండ ఆర్డీవో ఆనంద్‌కుమార్, డీఎస్పీ శ్రీనివాసులు, అధికారులు

మరువ పారింది.. మోము మురిసింది

సోమందేపల్లి, న్యూస్‌టుడే: సోమందేపల్లి గ్రామ చెరువు బుధవారం నిండి మరువ పారింది. తీవ్ర అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువు పారడంతో రైతులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. యువకులు, పిల్లలు చెరువు వద్దకు చేరుకొని మరువ నీటిలో కేరింతలు కొట్టారు. చెరువు మరువ పారుతూ దిగువనున్న చాకార్లపల్లి చెరువు, కుంటలు, చెక్‌డ్యాములకు నీరు చేరుతున్నాయి. చెరువు కట్టపై పెరిగిన కంపచెట్లు, పిచ్చి మొక్కలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.



మరువ పారుతుండటంతో యువకులు, పిల్లల కేరింతలు

రైల్వేరోడ్డు విస్తరణకు ఆక్రమణల తొలగింపు

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురంలో రైల్వేరోడ్ విస్తరణకు తిరిగి భవనాల తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. ఎన్టీఆర్ కూడలి నుంచి గతంలో ఇచ్చిన మార్కింగ్ ఆధారంగా మున్సిపల్ అధికారులు భవనాలు, దుకాణాలను రెండు రోజుల నుంచి తొలగిస్తున్నారు. కొంతమంది తమ దుకాణాలను సొంతంగా తొలగిస్తుండగా.. మిగిలిన వాటిని మున్సిపాలిటీ వారు తొలగిస్తున్నారు. ప్రధాన రహదారుల్లో ఒకటైన రైల్వేరోడ్ నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. దీన్ని విస్తరించాలని గత వైకాపా ప్రభుత్వంలోనే పనులు ప్రారంభించారు. నంది కూడలి నుంచి గరిడిగణేశ్ విగ్రహం ఏర్పాటు వరకు దాదాపు 85 శాతం భవనాలు తొలగించి కొంత మేర మురుగు కాలువ నిర్మించారు. రహదారి విస్తరించాలంటే ప్రైవేట్ భవనాలు తొలగించాల్సి ఉన్నందున వారికి బాండ్ల రూపంలో సాయం అందించటంలో కొంత జాప్యం చోటు చేసుకొంది. ఈ సమయంలోనే ముగ్గురు కమిషనర్లు మారడంతో రహదారి విస్తరణ పనుల్లో మరింత జాప్యం జరిగింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఎమ్మెల్యే బాలకృష్ణ దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగానే నూతన కమిషనర్ సింగం శ్రీనివాసులు సంబంధిత భవనాల యజమానులతో సంప్రదింపులు జరిపి తొలగింపు పనులు చేపట్టారు. రహదారి నిర్మాణం జరిగితే దీర్ఘకాలంగా పట్టణ వాసులు పడుతున్న ఇబ్బందులు తొలగి రాకపోకలకు సౌలభ్యంగా ఉంటుందని పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



భవనాల కూల్చివేత

మడుగు కాదు.. రహదారే

చిలమత్తూరు మండలం మొరసనపల్లి పంచాయతీ ఎస్.ముద్దిరెడ్డిపల్లి గ్రామంలో ప్రధాన రహదారి ఇది. వర్షానికి మడుగులా మారింది. కనీసం అడుగు వేయలేని పరిస్థితి. గ్రామంలో దాదాపు 200 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కనీసం 108 వాహనం, ఆటోలు రావడం లేదని గ్రామస్థులు వాపోయారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఎస్.ముద్దిరెడ్డిపల్లి(చిలమత్తూరు)



బస్సుషెల్టర్ లేక అవస్థలు

గోరంట్లలో బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు నానా అవస్థ పడుతున్నారు. తుపాను ప్రభావంతో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. బస్సులు వచ్చే వరకు మహిళలు, వృద్ధులు, పిల్లలు పాతబస్టాండు సమీపంలోని రావిచెట్టు కూడలిలో రోడ్డుపైనే నిల్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సమస్యను మేజర్ పంచాయతీ సర్పంచి సరోజబాయి దృష్టికి తీసుకెళ్లగా రావికుంట కూడలిలో బస్సుషెల్టర్ నిర్మాణానికి పంచాయతీ నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే పనుల ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. **- న్యూస్‌టుడే, గోరంట్ల**





శిథిల గదుల్లో భయంగా విధులు

పెనుకొండ, న్యూస్‌టుడే: ఇటీవల కురుస్తున్న వర్షాలకు పెనుకొండలోని గ్రామీణ నీటిసరఫరా డీఈ కార్యాలయం పైకప్పు కారుతోంది. ప్రధాన రోడ్డు విస్తరణలో భాగంగా ప్రహరీ కూల్చివేశారు. దాదాపు రెండేళ్లవుతున్నా నిర్మాణం చేపట్టలేదు. దాంతో రోడ్డుపైన పారే వర్షం నీళ్లు కార్యాలయ ఆవరణలోకి వచ్చి చేరుతున్నాయి. కార్యాలయం లోపల, బయట తడిసి ముద్దయ్యింది. 1910లో నిర్మించిన ఈ కార్యాలయంలో పెంకుల పైకప్పుతో ఉన్న రెండు గదుల్లో మాత్రమే సిబ్బంది విధులు నిర్వహించేందుకు, రికార్డులు నిల్వ చేయడానికి ఉపయోగపడుతున్నాయి. అనుబంధంగా నిర్మించిన గదుల్లో పైకప్పు పెచ్చులూడి కనీసం రికార్డులు నిల్వ చేయడానికి పనికి రాకుండా పోయాయి. గత ఐదేళ్ల వైకాపా పాలనలో కనీసం గదుల పైకప్పు మరమ్మతులకు నిధులు కేటాయించలేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కారుతున్న గదుల్లోనే విధులు నిర్వహించాల్సి దుస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ సారైన కార్యాలయ మరమ్మతులకు నిధులు వస్తాయని అధికారులు ఎదురు చూస్తున్నారు. ఈ విషయమై డీఈ శ్రీనివాసులు మాట్లాడుతూ సమస్యను గతంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధుల్లేకపోవడంతో మిన్నకుండిపోయాం. ప్రస్తుతం నివేదికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపుతాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.



డీఈ గదిలో కారుతున్న పైకప్పు

అమ్మ దూరమై.. నాన్న మంచానికి పరిమితమై

ఇద్దరు చిన్నారుల పరిస్థితి దయనీయం

రొద్దం, న్యూస్‌టుడే: ఆలనా పాలనా చూసుకునే అమ్మ క్యాన్సర్‌తో పోరాడుతూ మృతి చెందింది. కూలీ పనులు చేసి కుటుంబాన్ని పోషించే నాన్న కాళ్లపై గోడ కూలడంతో గాయమై మంచానికే పరిమితమయ్యారు. అమ్మను తలచుకుంటూ ఇద్దరు చిన్నారులు రోధించిన తీరు పలువురిని కలచివేసింది. ఈ ఘటన పావగడలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబం, బంధువుల వివరాల మేరకు.. రొద్దం మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన దుర్గమ్మ(26), నరసింహులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. వీరికి అనన్య, సందీప్ సంతానం. దుర్గమ్మ క్యాన్సర్ వ్యాధితో బాధపడేవారు. బెంగళూరులో వైద్యం చేయించారు. మెరుగైన వైద్యచికిత్సలకు ఆర్థిక స్థోమత లేక తన పుట్టినిల్లు అయిన పావగడలోని నాన్నగానిపల్లికి వెళ్లారు. గత సోమవారం నరసింహులు కొంత డబ్బు పోగు చేసుకొని ఆమెకు వైద్యం చేయించాలని పావగడ వెళ్లారు. అక్కడ ఆటో కోసం ఎదురుచూస్తుండగా గోడ కూలి కాళ్లపై పడింది. తీవ్రంగా గాయపడటంతో స్థానికులు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బుధవారం దుర్గమ్మ మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. బంధువులు, స్థానికులు కలిసి ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. బాధిత కుటుంబ పరిస్థితిని తెలుసుకొని పలువురు దాతలు రూ.40వేలు ఆర్థిక సాయం అందించారు.



తల్లిని కోల్పోయిన చిన్నారులు





పేదింటి బిడ్డలు.. క్రీడల్లో మెరుపులు

లేపాక్షి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న గ్రామీణ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. సరైన సౌకర్యాలు లేకపోయినా.. క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేసి పతకాలు సాధించారు. ఇటీవల మండల స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన వివిధ క్రీడాంశాల్లో పాల్గొని ప్రతిభ చాటిన విద్యార్థులు తమ అభిప్రాయాలను 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.

వాలీబాల్‌లో సత్తా చాటి..

- సంతోశ్, పదో తరగతి, శిరివరం ఉన్నత పాఠశాల

మాది లేపాక్షి మండలం శిరివరం. తల్లిదండ్రులు అనిత, రాజ్‌కుమార్ వ్యవసాయ కూలీలుగా పని చేస్తూ నన్ను చదివిస్తున్నారు. గతేడాది వాలీబాల్‌లో నియోజకవర్గ, జిల్లాస్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీల్లోనూ పాల్గొన్నా. ఈ ఏడాది పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవిశంకర్, పీడీ సంపత్‌కుమార్ ప్రోత్సాహంతో జాతీయస్థాయి పోటీల్లోనూ సత్తా చాటాలనే లక్ష్యంతో సాధన చేస్తున్నా.



అందరి ప్రోత్సాహంతో..

- వసంత్, తొమ్మిదో తరగతి, జ్యోతిబా ఫులే గురుకుల పాఠశాల, లేపాక్షి

మాది కదిరి మండలం జోగివారిపల్లి. నాన్న అంజినప్ప, అమ్మ చిట్టి వ్యవసాయ పనులు చేస్తారు. ప్రిన్సిపల్ సుందర్‌రాజు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రతిరోజూ చేయిస్తున్న సాధనతో హ్యాండ్‌బాల్‌లో ప్రతిభ చాటాను. గతేడాది వివిధ స్థాయిల్లో నిర్వహించిన పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాను.



జాతీయ పోటీలకు ఎంపికే లక్ష్యం

- ఇందు, తొమ్మిదో తరగతి, ఓరియంటల్ ఉన్నత పాఠశాల, లేపాక్షి

మాది లేపాక్షి. నాన్న నరసింహప్ప, అమ్మ ఈశ్వరమ్మ వ్యవసాయం చేస్తారు. వ్యాయామ ఉపాధ్యాయుడు సురేశ్ ప్రోత్సాహంతో నిరంతరం తర్ఫీదు పొందడంతో ఖోఖోపై మక్కువ పెరిగింది. బంగారుపాలెంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాను. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై సత్తా చాటాలని సాధన చేస్తున్నా.





పుట్టపర్తి
•పుట్టపర్తి •ధర్మవరం •కదిరి •రాప్తాడు

18న మంత్రి సత్యకుమార్ పర్యటన

ధర్మవరం, న్యూస్‌టుడే: రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ నెల 18, 19 తేదీల్లో ధర్మవరం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. వివరాలను ధర్మవరం ఆర్డీవో మహేష్ బుధవారం వెల్లడించారు. 18న ముదిగుబ్బలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ, గ్రామసభలో మంత్రి పాల్గొననున్నారు. తాడిమర్రి మండలం ఏకపాదంపల్లిలో నిర్వహించనున్న పల్లె పండగ పంచాయతీ వారోత్సవాల్లో పాల్గొంటారు. బత్తలపల్లి మండలం మాల్యవంతంలో సీసీ రోడ్డును ప్రారంభించనున్నారు. గ్రామంలో నిర్వహించే పల్లె పండగ పంచాయతీ వారోత్సవాల్లో మంత్రి పాల్గొననున్నారు. 19న ధర్మవరం మండలం గొట్లూరులో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు ప్రారంభిస్తారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంత్రి ప్రారంభించనున్నారు.

బాలికల వసతి గృహం పరిశీలన

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువులో ప్రైవేట్ భవనంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ బాలికల వసతి గృహాన్ని తహసీల్దార్ నీలకంఠారెడ్డి బుధవారం తనిఖీ చేశారు. తుపాను కారణంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రేకుల షెడ్డులోని హాస్టల్‌ను ఆయన పరిశీలించారు. బాలికలతో మాట్లాడారు. పురాతన రేకుల షెడ్డులోని వంటగది, బాలికల పెట్టెలను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. 150 మంది బాలికలకు తగిన వసతులు లేవని గుర్తించారు. బీసీ కాలనీలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాన్ని పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రి వెనుక బాలికల హాస్టల్ కోసం నిర్మిస్తున్న నూతన భవనం గురించి విచారించారు. కలెక్టర్‌కు నివేదిక పంపుతామని తెలిపారు. ఆయన వెంట డీటీ బాలాంజనేయులు, ఆర్ఐ కిరణ్ కుమార్ ఉన్నారు.

19న పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగమేళా

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 19న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సురేష్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మౌఖిక పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులు ధ్రువపత్రాలు తీసుకుని రావాలని సూచించారు.

పంట నష్టం అంచనా

నంబులపూలకుంట (గాండ్లపెంట): మండల పరిధిలోని పి.కొత్తపల్లి, ఎన్పీకుంట, దనియానిచెరువు గ్రామాల్లో పంట పొలాలను వ్యవసాధికారి లోకేశ్వరరెడ్డి బుధవారం పరిశీలించారు. వర్షాల ధాటికి వేరుసెనగ పంట మొలకలు వస్తున్నట్లు గుర్తించారు. మండల వ్యాప్తంగా 6 వేల ఎకరాల్లో వేరుసెనగ పంట సాగులో ఉందని, వర్షం ఇలాగే కొనసాగితే 2 వేల ఎకరాలకు పైగా దెబ్బతినే అవకాశం ఉందని అంచనా వేశారు. వరి, కంది, ఉలవ, వేసుకున్న రైతులకు తుపాను ప్రభావం ఏమీ లేదని రైతులకు అవగాహన కల్పించారు.

చెత్త విషయంలో ఘర్షణ.. ఒకరికి గాయాలు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: ఇంటి ఎదుట చెత్తవేయొద్దన్నందుకు దాడిచేసి గాయపరిచిన ఘటనపై కదిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు పోలీసులకు తెలిపిన మేరకు వివరాలు.. కదిరి పట్టణం నిజాంవలికాలనీలో నివాసం ఉంటున్న షామీర్‌బాషా ఇంటికి ఎదురుగా అదే ప్రాంతానికి చెందిన షమీమ్ కుటుంబ సభ్యులు చెత్తను వేస్తున్నారు. దీనివల్ల అనారోగ్యంగా ఉండటంతో చెత్తను వేయవద్దని షామీర్‌బాషా సూచించారు. దీంతో ఆగ్రహించిన షమీమ్ ఆమె కుమార్తె షీమా, కొడుకు నిసార్ వాదనకు దిగి ఆయనపై దాడిచేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కోతకొచ్చిన పంట నష్టం

● ఆందోళనలో వేరుసెనగ రైతులు

“ **ముదిగుబ్బ, కదిరి, పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మూడ్రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపిలేని వర్షాలకు శ్రీసత్యసాయి జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మరో రెండ్రోలుపాటు వర్షాలు కురిసే అవకాశముండటంతో కోతకోసిన వేరుసెనగ పంట మొలకలెత్తుతున్నాయని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ”



ఈదులపల్లిలో తడిసిపోయిన వేరుసెనగ పంట

● ముదిగుబ్బ మండలంలోని ఈదులపల్లికి చెందిన రైతు కమతం తీర్థానందరెడ్డి రెండు ఎకరాల్లో సాగుచేసిన వేరుసెనగ పంట మూడ్రోజుల కిందట పీకించాడు. అప్పట్నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తుండటంతో పంట మొత్తం తడిసిపోయింది. ఇంకా రెండ్రోలు వర్షాలు ఇలానే కురిస్తే తడిసిన కాయిలు మొలకెత్తుతాయి. సుమారు రూ.1.50 లక్షల నష్టం వచ్చిందని, వర్షానికి తడిసిన కాయలు, వేరుసెనగకట్టె నల్లగా మారడంతో అమ్ముడుపోవని రైతు ఆందోళన వ్యక్తం చేశారు.

డివిజన్, మండలాలు	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
ధర్మవరం 6	28,499
కదిరి 10	28,235
పుట్టపర్తి 6	62,410

● నంబులపూలకుంట మండలం పి.కొత్తపల్లికి చెందిన రైతు సుధాకర్ మూడు ఎకరాలు కౌలుకి తీసుకుని వేరుసెనగ సాగుచేశారు. పంటకోసి వదులుపెట్టగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో వేరుసెనగ కాయలు మోసులు పోతున్నాయి. వర్షానికి పంట మొత్తం తడిసిపోయి దెబ్బతినడంతో సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లింది. దీనికితోడు మూడెకరాలకు రూ.10 వేలు కౌలు చెల్లించాలని రైతు వాపోయారు.

● నల్లమాడ మండలం రాగానిపల్లికి చెందిన జనార్దన్‌రెడ్డి నాలుగు ఎకరాల్లో వేరుసెనగ పంట సాగుచేశారు. పంట అదునుదాటిపోతోందని ఐదు రోజుల కిందట కోతకోశారు. చిరుజల్లులు పడుతుండటంతో సగం పంట అక్కడే నూర్పిడి యంత్రం ద్వారా కాయలు ఆడించగా, మిగిలిన సగం పంటను వాముగా వేసి పట్ట కప్పెట్టారు. మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో వేరుసెనగ కాయలు బూజుపట్టగా, కట్టె నల్లగా మారింది. సుమారు రూ.2.50 లక్షల వరకు నష్టం వచ్చిందని రైతు తెలిపారు.



సమస్య: ఏపుట్లవాండ్లపల్లిలో నివాసం ఉంటున్న గృహాలపై విద్యుత్తు తీగలు ఉండటంతో వర్షాకాలంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంగా ఉంది. **- కేశవ, పురుషోత్తం, చంద్ర**



సమస్య: అమడగూరులో విద్యుత్తు సరఫరాలో పలుమార్లు అంతరాయం ఏర్పడుతోంది. సమస్యపై అధికారులకు చెప్పినా స్పందన లేదు. **- రామాంజి, సుదర్శన్, మారుతి**

సమాధానం: పుట్లవాండ్లపల్లిలో విద్యుత్తు తీగల సమస్యను పరిష్కరిస్తాం. విద్యుత్తు లైన్ ఉన్న పలు ప్రాంతాల్లో చెట్లు అధికంగా ఉండటంతో సరఫరాలో అంతరాయం వస్తోంది. పరిష్కారానికి చర్యలు చేపడతాం. **- చంద్రనాయక్, విద్యుత్తు ఏఈ**

సమస్య: అమడగూరు ప్రధాన వీధిలో గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలకు గుంతల్లో నీరు ఉండటంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. **- బాబు, సులేమాన్, మూర్తి**

సమాధానం: ఇటీవలే బాధ్యతలు స్వీకరించాను. సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కార చర్యలు చేపడతాం. **- మమత, పంచాయతీ కార్యదర్శి** - న్యూస్‌టుడే, అమడగూరు

మద్దిలేరువాగులో వ్యర్థాల తొలగింపు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కోనేరుకు ఆనుకుని ఉన్న మద్దిలేరువాగులో పట్టణవాసులతో పాటు మున్సిపల్ సిబ్బంది వ్యర్థాలను వాగులోకి వదలడం ద్వారా వాగు పూడిపోతోంది. ఈ విషయమై ‘వ్యర్థాల దిబ్బగా మద్దిలేరు వాగు’ శీర్షికన మంగళవారం ‘ఈనాడు’లో ప్రచురితమైన చిత్రకథనానికి మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ స్పందించారు. పొక్లెయిన్‌తో వ్యర్థాలను తొలగింపజేసి ట్రాక్టర్ల ద్వారా తరలించారు. మరోసారి వాగులో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



పొక్లెయిన్‌తో వ్యర్థాలు, పూడిక తొలగింపు

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తాం

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మేడాపురం గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే పర్యటించారు. కార్యక్రమానికి ముఖ్య పరిటాల సునీత హాజరై గ్రామంలో రూ.60 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. నియోజకవర్గంలో ఇప్పటికే రూ.25 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. మరిన్ని నిధులను తీసుకువచ్చి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని వివరించారు. స్థానిక ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గత వైకాపా పాలనలో తమకు అర్హత ఉన్నా పింఛన్లు, రేషన్ కార్డులు తొలగించి అన్యాయం చేశారని పలువురు బాధితులు ఎమ్మెల్యే వద్ద వాపోయారు. తెదేపా సీనియర్ నాయకుడు ఎల్ నారాయణ చౌదరి, మండల కన్వీనర్ ముత్యాల రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఓబుళేసు, మాజీ సర్పంచి పెద్ద వెంకటరాముడు, నాయకులు లక్ష్మయ్య, వెంకటేశ్, రాము, పంచాయతీరాజ్ డీఈ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ సురేష్, ఈవోఆర్డీ అశోక్ నాయక్ పాల్గొన్నారు.

● గ్రామానికి చెందిన తెదేపా సీనియర్ నాయకుడు ఆదినారాయణను ఎమ్మెల్యే పరిటాల సునీత పరామర్శించారు. కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదినారాయణ స్వగృహానికి వెళ్లి బుధవారం పరామర్శించారు. ఆరోగ్య, కుటుంబ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట శ్రీసత్యసాయి జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు రంగయ్య ఉన్నారు.



చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురంలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ఒకటే వాన..

■ జలమయమైన రహదారులు.. ప్రజల ఇబ్బందులు



ధర్మవరం గాంధీనగర్ ప్రధాన రహదారిపై వర్షపు నీరు



పుట్టపర్తిలో కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ చేతన్

ధర్మవరం, న్యూస్‌టుడే: తుపాను కారణంగా ధర్మవరం, పుట్టపర్తి, కదిరి, రాప్తాడు నియోజకవర్గాల్లో బుధవారం ఎడతెరిపి లేని వర్షం పడింది. రోజంతా జోరువాన పడటంతో పట్టణాల్లోని ప్రధాన రహదారులు, వీధులు జలమయమయ్యాయి. నీటిలోనే వాహనదారులు ఇక్కట్లు పడుతూ వెళ్లారు. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ధర్మవరం ఆర్డీవో మహేష్ రెవెన్యూ డివిజన్‌లోని తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బందితో ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలుసుకొని తగు సూచనలు ఇచ్చారు. గొట్లూరు చెరువుకు నీరు వస్తుండటంతో ఆర్డీవో పరిశీలించారు.

రహదారులు ఛిద్రం: ధర్మవరం పట్టణంలో రెండ్రోజులుగా కురిసిన వర్షాలకు రహదారులు దెబ్బ తిన్నాయి. 1వ పోలీసుస్టేషన్ కూడలి వద్ద ప్రధాన రహదారి పలుచోట్ల ఛిద్రమై గుంతలు పడింది. పోతుకుంట రైల్వే వంతెన మార్గంలోనూ గుంతలుపడ్డాయి. ఎన్టీఆర్ కూడలి వద్ద రహదారి కోతకు గురి కావడంతో ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు ప్రమాదకరంగా వెళ్లాల్సి వస్తోంది. గాంధీనగర్, శివానగర్ రైల్వేగేటు, పురపాలక కార్యాలయం రహదారిపై పలుచోట్ల గుంతలు పడ్డాయి.

బుక్కపట్నం: మండలంలోని అన్ని గ్రామాల్లో రెండ్రోజులుగా కుండపోత వర్షం కురుస్తోంది. ఎర్లంపల్లి సమీపంలో వంక ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. గ్రామస్థులు గ్రామం నుంచి బయటకు రావాలంటే ఈ వంక దాటాల్సిందే. వంక ఉద్ధృతంగా ప్రవహిస్తే గ్రామస్థులు ఎన్నిరోజులైనా అక్కడే ఉండిపోవాల్సిన పరిస్థితి. ఎన్నిమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలియజేసినా పట్టించుకోలేదని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోనైనా వంతెన నిర్మించి ఆదుకుంటారని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



ధర్మవరం ఎన్టీఆర్ కూడలిలో కోతకు గురైన రహదారి



ఎర్లంపల్లి దగ్గర ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వంక →

‘ఈనాడు’ కథనానికి స్పందన

ప్రహరీ నిర్మాణానికి చర్యలు

ముదిగుబ్బ : జొన్నలకొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో పడిపోయిన ప్రహరీను నిర్మించేలా చర్యలు తీసుకుంటామని ఎంఈవో-2 రమణప్ప తెలిపారు. పాఠశాలకు ప్రహరీలేక చుట్టుపక్కల కంప, ముళ్లచెట్లు పెరిగి పరిసరాలు అధ్వానంగా మారడంతో ఈనెల 16న ‘ప్రహరీ నిర్మాణం ఇంకెప్పుడు?’ అన్న శీర్షికతో ‘ఈనాడు’లో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంఈవో-2 రమణప్ప బుధవారం ప్రధానోపాధ్యాయుడు సుంకన్నతో కలిసి పాఠశాలను పరిశీలించారు.

రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

అమడగూరు, న్యూస్‌టుడే: వర్షాలను దృష్టిలో పెట్టుకొని రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి. గ్రామాల్లో వర్షాలకు ప్రజల నుంచి ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే స్పందించాలని కదిరి ఆర్డీవో వెంకటసన్యాసిశర్మ ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం సిబ్బందితో సమావేశమయ్యారు. చెరువులు, కుంటలు.. ప్రస్తుతం వాటి స్థితిగతులు, చెరువులు నిండితే ఎక్కడైనా ప్రమాదాలు జరగడానికి లేదా రహదారులు దెబ్బతినడానికి అవకాశాలపై సమీక్షించారు. అనంతరం పేరంవాండ్లపల్లి చెరువు వర్షాలకు నిండి మరవ పోతుండటంతో క్షేత్రస్థాయిలో చెరువును పరిశీలించారు. తహసీల్దార్ రామనాథరెడ్డి, ఉపతహసీల్దార్ వెంకటరెడ్డి, ఎంపీడీవో మునెప్ప, ఆర్ఐ ఈశ్వరయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

పాతచెరువు పరిశీలన

తలుపుల: 2021లో వచ్చిన కండపోత వర్షాలకు జరిగిన ప్రమాద స్థలాన్ని జేసీ అభిషేక్‌కుమార్ బుధవారం పరిశీలించారు. అప్పట్లో ఓదలపల్లి పంచాయతీలో కదిరి-పులివెందుల ప్రధాన రహదారి కొట్టుకుపోయింది. సమీపంలోని పాతచెరువు తెగిపోయింది. కదిరికి చెందిన ఓ కారు కొట్టుకుపోయింది. ఆ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరు గల్లంతయ్యారు. ప్రమాదకర వాగులు, చెరువుల ఉద్ధృతికి రోడ్డు తట్టుకోగలదా, లేదా, తదితర అంశాలపై స్థానిక తహసీల్దార్ రెడ్డిశేఖర్‌ను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం తలుపుల రెవెన్యూ కార్యాలయానికి వచ్చి పలు దస్త్రాలను పరిశీలించారు. ఆ తర్వాత బుక్కపట్నం చెరువును జేసీ పరిశీలించారు. కంట్రోల్‌రూమ్‌ను తనిఖీ చేశారు.

కదిరి గ్రామీణం: మండల పరిధిలోని దేవర చెరువు, వితల రాయుడి చెరువు కట్టలు, మరువ ప్రాంతాలను భారీ వర్షాల నేపథ్యంలో కదిరి మండల తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీవో పోలప్ప నీటిపారుదల శాఖ, పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మరువ ప్రాంతాల్లో తీసుకోవాల్సిన అవసరమైన చర్యలను అధికారులతో కలిసి చర్చించారు. కార్యక్రమాల్లో నీటిపారుదలశాఖ ఏఈ మహేష్, పంచాయతీ కార్యదర్శులు శివశంకర్, విజయ్, కేదార్‌నాథ్, మహేష్, శైలజ తదితరులు పాల్గొన్నారు.



పేరంవాండ్లపల్లి చెరువును పరిశీలిస్తున్న ఆర్డీవో వెంకటసన్యాసిశర్మ

వీఆర్వోపై రైతులు, తెదేపా నాయకుల ఫిర్యాదు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువు మండలం కొడపగానిపల్లిలో వీఆర్వో కాటమయ్య పక్షపాతంగా విధులు నిర్వర్తించడమే కాకుండా డబ్బు డిమాండ్ చేస్తున్నాడని తెదేపా నాయకులతో పాటు పలువురు రైతులు తహసీల్దార్ నీలకంఠారెడ్డికి బుధవారం ఫిర్యాదు చేశారు. దీంతో సంబంధిత వీఆర్వోను తహసీల్దార్ పిలిపించి మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వంలో అనర్హులైన వారి భూములను ఫ్రీహోల్డ్ చేసి.. అర్హులైన తెదేపా వర్గీయుల భూములను పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపించారు. తన భూమి ఫ్రీహోల్డ్‌లో చేర్చడానికి వీఆర్వో రూ.50 వేలు డిమాండ్ చేశాడని రైతు నవీన్ ఫిర్యాదు చేశారు. దురుద్దేశంతో కొందరు తనపై ఫిర్యాదు చేస్తున్నారని వీఆర్వో వివరణ ఇవ్వగా.. పద్ధతి మార్చుకోవాలని తహసీల్దార్ వీఆర్వోను మందలించారు. అనర్హులు, అర్హుల వివరాలు తనకు అందించాలని గ్రామ రైతులకు సూచించారు. గతంలో చేసిన ఫ్రీహోల్డ్ జాబితాపై విచారణ చేస్తామని నాయకులు, రైతులకు హామీ ఇచ్చారు. తెదేపా మండల కన్వీనర్ జయప్ప రామకృష్ణ, పట్టణ కన్వీనర్ వలిపి శీనా, శ్రీనివాసులు, పెద్దన్న, శివ, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో భార్యపై భర్త దాడి

ధర్మవరం, న్యూస్‌టుడే: మండలంలో నాగలూరు గ్రామంలో బుధవారం జానకి అనే వివాహితపై భర్త శంకర్ కర్రతో దాడి చేశాడు. జానకి తలపై బలమైన గాయాలు తగిలాయి. ఆమెను చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తన భర్త మద్యం తాగి వచ్చి కర్రతో తలపై కొట్టాడని జానకి ధర్మవరం గ్రామీణ పోలీసులకు తెలిపింది. వివరాలు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కారును ఢీకొన్న కంటైనర్

తనకల్లు, న్యూస్‌టుడే: కంటైనర్ లారీ కారును ఢీకొనడంతో కారులో ఉన్న నలుగురు గాయపడిన ఘటన తనకల్లు మండలం మరాలపల్లి సమీపంలో బుధవారం జరిగింది. నల్లచెరువు మండలానికి చెందిన బి.నరసింహులు, దాసరిరెడ్డి, శేఖర్, వెంకటేష్ కర్ణాటక రాష్ట్రం చిక్‌బల్లాపుర జిల్లా చేలూరు నుంచి స్వగ్రామానికి వస్తుండగా కొక్కంటిక్రాస్ వైపు నుంచి వెళ్తున్న కంటైనర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో నలుగురు గాయపడటంతో కదిరి ప్రాంతీయ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న వాహనాల జప్తు

బత్తలపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టరు, రెండు టిప్పర్లను బుధవారం తెల్లవారుజామున సీఐ ప్రభాకర్ పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న వాహనాలను మండలంలోని లింగారెడ్డిపల్లి క్రాస్‌లో పట్టుకొని కేసు నమోదు చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులకు అప్పగిస్తున్నట్లు సీఐ వివరించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

తాడిమర్రి, న్యూస్‌టుడే: పిన్నదరి గ్రామంలో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. గ్రామంలోని శ్రీనివాసులునాయుడు ఇంటి వద్ద ఉన్న ఓ భారీ వృక్షం వర్షానికి కూలి తీగల మీద పడింది. ఆ సమయంలో విద్యుత్తు సరఫరా అవుతున్నా అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వెంటనే గ్రామస్థులు విద్యుత్తు శాఖాధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి తీగలు సరిచేశారు. స్తంభాల సమీపంలో, తీగల పైన ఉన్న చెట్లను తొలగించుకోవాలని అధికారులు గ్రామస్థులకు సూచించారు.

మాజీ సర్పంచి మృతికి సంతాపం

కనగానపల్లి: మండలంలోని నెమిళివరం గ్రామానికి చెందిన మాజీ సర్పంచి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. నెమిళివరం గ్రామానికి చెందిన తెదేపా మాజీ సర్పంచి లక్ష్మీనారాయణ (51) కొద్ది రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. వైద్య సేవలను పొందుతూ మృతి చెందాడు. ఆయన మృతిపట్ల మండలంలోని తెదేపా నాయకులు, కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

చింతామణి, న్యూస్‌టుడే: కెంచార్లహళ్లి పోలీసుస్టేషన్ పరిధి మదనపల్లె రోడ్డు దండుపాళ్య గేట్ సమీపంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో బేతమంగళకు చెందిన వివాహిత తరునం (22) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈమె భర్త అయాజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కదిరి నుంచి విజయపురకు వెళుతున్న బొలెరో వాహనం బేతమంగళకు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న తరునం ప్రమాద స్థలంలోనే మృతి చెందింది. బొలెరోలో ప్రయాణిస్తున్న కదిరికి చెందిన ఆదెప్ప, ఫకృద్దీన్, సబీనా, ఆజాద్, షబానా, షోయబ్, సలీమ్ గాయపడగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కెంచార్లహళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పెచ్చులూడుతున్న పాఠశాల పైకప్పు

మండలంలోని చంద్రాయునిపల్లి ప్రాథమిక పాఠశాలలో 30 మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. రెండు గదుల్లో పాఠాలు బోధిస్తున్నారు. పైకప్పు పెచ్చులూడి కింద పడుతోంది. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు మరింత ప్రమాదకరంగా ఉన్నదని, ఎన్‌హెచ్ 342 రోడ్డుకు పాఠశాలలో ఒక గదితోపాటు ప్రహరీ కూడా తొలగించాల్సి ఉంది. ఇప్పటికే ఎన్‌హెచ్ అధికారులు పలుమార్లు పాఠశాల తరగతి గది, ప్రహరీ తొలగించేందుకు ప్రయత్నిస్తే గ్రామస్థులు అడ్డుకున్నారు. పాఠశాలకు నూతన భవనం నిర్మాణం చేసిన తర్వాతే తొలగించాలని, అప్పుడే రోడ్డు పనులకు సహకరిస్తామని తెలిపారు. దీనిపై ఎంఈఓ గోపాల్‌నాయక్‌ను వివరణ కోరగా రోడ్డుకు పాఠశాల గదితోపాటు ప్రహరీ తొలగించాల్సి ఉంది. ఇప్పటికే ఉన్నతాధికారులకు సైతం ఈ విషయాన్ని తెలియజేశాం. నూతన భవనం నిర్మాణం చేయాలని గ్రామస్థుల విజ్ఞప్తిని కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి ఆదేశాల మేరకు తగిన చర్యలు చేపడుతామన్నారు. **- న్యూస్‌టుడే, బుక్కపట్నం**



ఒరిగిన స్తంభం.. కూలేందుకు సిద్ధం

ధర్మవరం మండలం గొట్లూరు గ్రామంలో ప్రధాన రహదారి పక్కన విద్యుత్తు స్తంభం ఒకవైపు ఒరిగి ప్రమాదకరంగా ఉంది. నివాసాల మధ్య రహదారి పక్కన ఉన్న స్తంభం ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గొట్లూరు నుంచి మలకాపురం వెళ్లే వాహనదారులు ఈ మార్గంలోనే రాకపోకలు చేస్తున్నారు. ఏదైనా వాహనం స్తంభానికి ఢీకొంటే ప్రమాదం తప్పదని స్థానికులు పేర్కొంటున్నారు. ఒరిగిన కరెంటు స్తంభాన్ని సరి చేయిస్తామని ధర్మవరం మండల విద్యుత్తుశాఖ ఏఈ జానకీరామ్ తెలిపారు. **- న్యూస్‌టుడే,ధర్మవరం**

